# మనసున మనసైన తోడు

కథ

-డా.తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

"అమ్మా! మీరిద్దరూ వచ్చి నన్ను తీసికెళ్లండి! నాన్నా మీకు సెలవు దొరకదు అనకుండా వెంటనే వస్తారు కదండీ?" ఫోనులో ఏడుపుగొంతుతో అడుగుతున్న కూతురి మాటలు వినగానే విశ్వేశ్వరరావుకీ జలజకూ గాబరాగా అనిపించింది.

పెళ్లై మూడు నెలలు కాక ముందే ఆడపిల్ల అమ్మానాన్నలను 'నన్ను పుట్టింటికి తీసుకువెళ్లండి' అని అడిగిందంటే నిజానికి ఏ తల్లిదండ్రులయినా కంగారు పడతారు.

అంతగా అమ్మానాన్నలను చూడాలని బెంగ పడితే తనే బయల్దేరి వచ్చేయవచ్చు కదా మధురిమ!

ఈ కాలం అమ్మాయికి ఉండే ధైర్యం, సమయస్ఫూర్తి ఉన్న పిల్ల. పి.జి.డిగ్రీ చేతిలో ఉండి, నాలుగు భాషలు మాట్లాడగలిగిన మధురిమ బెంగుళూరు నుండి అనంతపురం రావడానికి 'మీరొచ్చి తీసుకెళ్లండి' అన్నదంటే అది కచ్చితంగా అత్తగారి హుకుం అయి ఉండాలి అనుకుంది జలజ తల్లి మనసు.

"క్రొత్తకోడలు పుట్టింటికి వెడతానంటే ఇష్టం లేక 'మీ అమ్మానాన్ననే రమ్మను' అన్నదేమో ఆవిడ!" అంది జలజ.

ఎన్నో సంబంధాలు చూసినా ఎవరూ నచ్చని శ్రీపతికి మధురిమ మొదటి క్షణంలోనే నచ్చేసింది. నిజానికి విశ్వేశ్వరరావు దంపతులు కూతురికి చూసిన మొట్టమొదటి సంబంధం అది.

ఒకటికి నాలుగుసార్లు పెళ్లిళ్ల బ్యూరోల చుట్టూ తిరిగి, సరైన వరుడు దొరికి జాతకాలు కలవడం, పిల్లా పిల్లవాడు ఒకరికొకరు నచ్చడం వీటన్నిటి కన్నా ముఖ్యంగా పెట్టుపోతల విషయం ఒప్పందం కుదరడం జరిగేనరికి కనీసం సంవత్సరం సమయం పడుతుందనుకుంటూ మధురిమ ఎం.ఎస్.సి. అయి పోగానే పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాడు విశ్వేశ్వరరావు.

అనుకోకుండా అదృష్టం కలిసివచ్చినట్టు చూసిన మొదటి సంబంధమే కుదరడంతో ఆయన సంతోషంతో శ్రీపతి తల్లిదండ్రులు కోరిన దానికన్నా ఎక్కువగానే కట్నకానుకలు, చీరెసారెలు ముట్టజెప్పాడు వియ్యాలవారికి.

సన్నగా, పొడుగ్గా, చక్కని కనుముక్కు తీరుతో సాత్వికంగా కనబడే శ్రీపతి ఎం.బి.ఎ. చేసి బెంగుళూరులో మంచి కంపెనీలో ఉద్యోగంలో ఉన్నాడు. అతని అక్కలిద్దరికీ ముందే పెళ్లిళ్లు అయిపోయాయి.

శ్రీపతి తల్లిదండ్రులు ప్రకాశం, సువర్చల కొడుకు దగ్గర బెంగుళూరులోనే ఉంటారు. ప్రకాశం కిందటి సంవత్సరం పదవీ విరమణ చేయడం జరిగింది. హిందూపురంలో ఉన్న సొంత ఇల్లు అమ్మేసి కొడుకు దగ్గరకు వచ్చేశారు వాళ్లు ఎప్పటికైనా కొడుకే కదా తమని చూడాల్సింది అనుకుంటూ.

సువర్చల గానీ, ప్రకాశం గానీ పెళ్లిలో ముఖాలు ముడుచుకోవడం, అలకలు చూపడం వంటివి చేయలేదు. ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా పెళ్లి వేడుకలలో పాల్గొన్నారు. శ్రీపతి అక్కలిద్దరూ కూడా బాగా కలిసిపోయారు.

వాళ్లకున్నదే ఒక్కగానొక్క కూతురు. అల్లారుముద్దుగా పెంచుకున్నారు. అలాగని గారాబం చేసి పాడుచేయలేదు. పద్ధతిగా పెరిగి, బుద్ధిగా చదువుకుని నలుగురిలో మంచి పేరు తెచ్చుకున్నది మధురిమ.

గుణవంతుడైన, అనుకూలుడైన భర్త దొరికి తమ కూతురు జీవితంలో చక్కగా స్థిరపడిందన్న ఆనందంతో మూడు నెలలుగా ఎంతో నిశ్చింతగా ఉన్న మధురిమ తల్లిదండ్రులకు కూతురి నుండి వచ్చిన ఫోను సహజంగానే భయాందోళనలు రేకెత్తించింది.

ఆ రోజు రాత్రికే దొరికిన బస్సు పట్టుకుని, తెల్లవారుఝామున బెంగుళూరు చేరారు వాళ్లిద్దరూ. మబ్బు లేని వానలా వచ్చిన అత్తమామలను చూసి శ్రీపతి ఆశ్చర్యపోయాడు. 'పాపం కూతుర్ని వదలి ఉండడం మొదటి సారి కదా! దిగులుపడి చూడాలని వచ్చారేమో' అనుకుని ఇద్దర్నీ చిరునవ్వుతో పలుకరించి కుశలమడిగాడు.

వియ్యంకులకు మర్యాదలోపం చేయలేదు ప్రకాశం, సువర్చల. మధ్యాహ్నం భోజనాలయ్యాక అసలు విషయం ప్రస్తావించింది జలజ. "అమ్మాయిని తీసికెళ్లి పది రోజులు మా దగ్గర పెట్టుకుని పంపిస్తాం వదినా" అన్నది నేరుగా విషయంలోకి వస్తూ.

"అదేంటమ్మా మూడు నెలల్లోనే కూతురి మీద మనసు పోయిందా?" అని నవ్వాడు ప్రకాశం.

"ఇంతవరకు ఎప్పుడూ మాకు దూరంగా ఇన్నాళ్లు ఉండలేదు గద బావగారూ.. చదువు కోసం కూడా హాస్టల్లో ఉంచాల్సిన అవసరం రాలేదు" అన్నాడు విశ్వేశ్వరరావు.

"మీ ఇష్టం. అబ్బాయి ఏమంటాడో ఒక మాట అడిగి తీసుకెళ్లండి" అన్న ప్రకాశం అంతలో అక్కడకు వచ్చిన మధురిమను చూసి "ఏమ్మా అప్పుడే అమ్మావాళ్ల కోసం దిగులు పెట్టుకున్నావా?" అన్నాడు నవ్వుతూ.

మధురిమ బదులు పలకకుండా చిన్నగా నవ్వి తల వంచుకుంది.

"మెడలో తాళి పడగానే పుట్టింటి వాళ్లని మరచిపోగలరా ఏమిటండీ? మీరలా అడిగితే ఏం జవాబు చెప్తుంది? మీ అమ్మాయిని మీరు నాలుగు రోజులు తీసు

కువెడతానంటే మా వాడు మాత్రం వద్దంటాడా? నేను చెబుతాను వాడికి. నువ్వు బట్టలు సర్దుకో అమ్మా" అంది మధురిమ అత్తగారు.

అత్తగారు తనకు వత్తాసు పలికినందుకు మధురిమ ముఖంలో కనబడాల్సిన సంతోషం కనబడలేదు జలజకు. అంతేకాక కాస్త కళ తప్పినట్టు కనబడింది. ఇంటికి వెళ్లాక విషయమేమిటో నెమ్మదిగా ఆరా తీయాలి అనుకున్నదామె.

రాత్రి ఏడింటికి ఇల్లు చేరిన శ్రీపతి అత్తమామలతో మధురిమ ప్రయాణమవుతున్నదని తెలిసి నిరుత్సాహపడ్డాడు. పెద్దవాళ్ల ముందు మాట్లాడలేక ఊరుకున్నాడు.

"అంతేలే నీకు అమ్మానాన్నల మీద ఉన్న ప్రేమ నా మీద ఎందుకుంటుంది?" అని నిష్ఠూరంగా అన్నాడు భార్యతో.

"అయ్యో కొత్త మొగుడే.. విరహబాధ తాళలేడే. పాపం ఒంటరిగా వదలిపోవడం అన్యాయమే అనిపించడం లేదు కదూ నీకు?" అని అలిగాడు.

"క్రొత్త మొగుడు, పాత మొగుడు అంటూ వేరుగా ఉండరు" అంది అతన్ని మంచి ధోరణిలోకి తేవడానికి.


"నాకు నవ్వు రావడం లేదు. ఇప్పుడింతకీ ఈ ప్రయాణం దేనికీ? పోనీ సెలవు పెట్టి నేనూ వచ్చేయనా?" అనడిగాడు శ్రీపతి ఆశగా.



"నిన్నగాక మొన్న వచ్చినదాన్ని నా వెంట మీరు వచ్చేస్తే మొగుడిని కొంగుకు కట్టేసుకుంది అని నన్ను ఆక్షేపిస్తారు అందరూ. ఎంత పది, పదిహేను రోజుల్లో వచ్చేస్తానుగా" అంది మధురిమ.

'నాకు మాత్రం మిమ్మల్ని వదలి వెళ్లాలని ఉందా?' అనుకుని నిట్టూర్చింది.

మర్నాడే మధురిమతో సహా అనంతపురానికి బయ



ల్దేరి వచ్చారు విశ్వేశ్వరరావు దంపతులు. ఆ రోజంతా ఏవో కబుర్లు చెప్తూ మధురిమను ఉత్సాహపరచడానికి ప్రయత్నించింది జలజ. ముభావంగా ఉండిపోయింది కూతురు.

రెండ్రోజులు గడిచాక నెమ్మదిగా మనసులోని మాట బయట పెట్టింది మధురిమ.

"మా అత్తగారు స్వతహాగా మంచిదే అమ్మా! నేనే వెళ్లి అందుకుని చేయాల్సిందే తప్ప తను పిలిచి ఏ పనీ చెప్పదు. కొసరి కొసరి అన్నం పెడుతుంది. నాకిష్టమని మామగారిని అంత దూరాన ఉన్న మెజిస్టిక్ బస్‌స్టేషన్‌కి పంపి తెలుగు వారపత్రికలు తెప్పిస్తుంది. వచ్చిన చిక్కల్లా వాళ్ల కొడుకుతోనే" అని ఆగింది.

"అదేమిటి? మేము వచ్చినప్పుడు అబ్బాయి నీతో సరదాగానే ఉన్నాడే" ఆశ్చర్యంగా అడిగింది జలజ.

"అక్కడే వచ్చింది పేచీ! ఈయన పొద్దున్న లేచి ఆఫీసుకు వెళ్లే వరకు నా పేరు జపం చేస్తూ, నా చుట్టూ తిరుగుతూ ఉంటారు.. 'మధూ కాఫీ.. మధూ టిఫిన్ రెడీనా? మధూ నా షర్టేదీ?' అంటూ పిలుస్తూనే ఉంటారు. ఇక సాయంత్రం రాగానే 'అలా ఎక్కడికైనా సరదాగా తిరిగి వద్దాము' అంటూ బయల్దేరదీస్తారు. 'అమ్మా! నువ్వూ నాన్నా అన్నం తినేసేయండి. మేము ఆలస్యంగా వచ్చి తింటాము' అని చెప్పేస్తారు వాళ్లమ్మకు. మేము వచ్చాక భోజనానికి కూర్చోగానే అత్తయ్య వస్తారు వడ్డించడానికి ఈయనేమో అమ్మ ముందర నా కంచంలోని కూర తీసుకుని తినడం నాతో నోట్లో ముద్దలు పెట్టించుకోవడం లాంటి సరదాలు, మురిపాలు సాగవని 'నువ్వెళ్లి పడుకోవమ్మా' అని పంపించేస్తారు. పక్కింటి ఆవిడ మా ఇంటికి వస్తే 'కొడుకో అని గుండెల్లో పెట్టి పెంచుకుంటాం. పెళ్లామొచ్చాక తల్లి కంటికి కనబడదు మగవాడికి' అని చెప్పుకుంది మా అత్తగారు. ఎదురింటామెతో అంటుందీ 'ఇంట్లో ఉన్నంతసేపూ గదిలోంచి బయటకు రాదు. వాడేం చేస్తాడు వెర్రి నాగన్న' అని. మీకు ఫోను చేసిన రోజున నాతోనే చెప్పింది. 'మీ అమ్మా వాళ్లేమిటి పెళ్లి చేసి పిల్లను అత్తవారింటికి పంపించి చేతులు దులిపేసుకున్నారా? వాళ్లకేం కూతుర్ని చూడాలనీ, నాలుగు రోజులు తీసుకెళ్లి ఇంట్లో పెట్టుకుని పంపుదామనీ అనిపించదా?' అని. అందుకే ఏడుపొచ్చింది" అని చెప్పి ఊరుకుంది మధురిమ.

ఈ సమస్యను ఎలా పరిష్కరించాలా అనే ఆలోచ

నలో పడింది జలజ.

ఇక్కడ ఇలా ఉండగా అక్కడ శ్రీపతి ఇంట్లో మరొక రకంగా ఉంది.

మధురిమ పుట్టింటికి వెళ్లిపోయాక ఆ రోజు రాత్రి కొడుక్కి ఇష్టమైన 'బిసిబేళె హాళి' చేసి, ఉప్పు మిరపకాయలు, అప్పడాలు వేయించి పెట్టి శ్రీపతి కోసం చూస్తూ కూర్చుంది సువర్చల. తొమ్మిదవుతున్నా కొడుకు జాడ లేదు. ప్రకాశానికి విసుగేసి "మనం భోజనం చేద్దాం పద" అన్నాడు.

"మీకు ఆకలేస్తే మీరు తినేయండి. నేను వాడితో బాటు తింటాను" అంటూ ఆయనకు వడ్డించింది సువర్చల.


పదింటికి ఇల్లు చేరిన శ్రీపతితో "నీకిష్టమని 'బిసిబేళె హాళి' చేశానురా. నీ కోసం చూస్తూ నేనూ తినలేదు. త్వరగా కాళ్లు కడుక్కుని రా" అందావిడ ప్రేమగా.

"ఈ వయసులో రాత్రి పది గంటల వరకు భోజనం చేయకుండా ఉండడం ఏమిటమ్మా? నేనేం చంటిపిల్లవాడినా నాకు పెట్టి తినాలనుకోడానికి? మా స్నేహితుడు పార్టీ ఇచ్చాడు. శాంతిసాగర్‌లో భోజనం చేసి వచ్చాను" అనేసి వెళ్లి పడుకున్నాడు.

"టైమవుతూంది. ఇక బయల్దేరండీ" అంటూ మధురిమ హెచ్చరిస్తున్నా ఏదో ఒక వంకతో ఆ అమ్మాయిని గదిలోకి పిలిచి కబుర్లు చెబుతూ తొమ్మిదికి గానీ ఇల్లు వదలని శ్రీపతి ఇప్పుడు ఎనిమిది గంటలకే పని ఉంది.. అంటూ వెళ్లిపోయి, రాత్రి ఆలస్యంగా వస్తున్నాడు. కొడుకు కోసం అతనికిష్టమైనవి వండిపెడుతున్న సువర్చల పరధ్యానంగా కూర్చుని, రెండు నిముషాలలో ఏదో తిన్నాననిపించి చేయి కడుక్కుంటున్న శ్రీపతి వాలకం చూసి మనసు కష్టపెట్టుకుంటోంది.

"ఈ రోజు సెలవే కదరా! చక్కగా తలకు నూనె మర్దనా చేస్తాను. శీకాయతో తల రుద్దుకుని స్నానం చేయి" అంటూ తల్లి నూనె గిన్నె తెస్తే "నిన్ననే షాంపూతో తలరుద్దుకొన్నానమ్మా" అంటూ తప్పించుకున్నాడు శ్రీపతి.

పెళ్లాన్ని బ్రతిమలాడి తలకు నూనె రాయించుకుని, స్నానం మధ్యలో పని ఉన్నట్టు మధురిమను నీళ్ల గదిలోకి పిలిచి శీకాయతో తలంటు పోయించుకునే కొడుకు అలా అనడంతో ఆవిడ మనసు చివుక్కుమంది. మధురిమ రాకముందు తానే కదూ వాడికి తలంటి స్నానం చేయించేది.






పోనీలే సెలవు రోజున ఇంటి పట్టున ఉండి వేళ్లకు భోజనం చేస్తాడని మసాలా వడలు చేసిపెడదామని శనగపప్పు నానపోసి వంట ప్రయత్నం మొదలుపెట్టింది సువర్చల.

"అమ్మా! నా కోసం వంట చేయకు. నేను అనంతపురం వెళ్తున్నా. సోమవారం పొద్దున్నే వచ్చేస్తాను" అంటూ ఎనిమిది గంటలకే వెళ్లిపోయాడు శ్రీపతి.

ముందు చెప్పకుండా వచ్చి ఆశ్చర్యపరచిన మొగుడిని చూసి మధురిమ మురిసిపోయింది. వారం రోజులుగా ఫోనులో రోజూ గంట సేపు మాట్లాడుతూనే ఉన్నా అతనితో మాట్లాడి యుగాలు గడిచాయన్నట్టు తలకు నూనె పెడుతూ, వీపు తోముతూ, అన్నం పెడుతూ కబుర్లు చెప్పింది మధురిమ.

కూతురికి అల్లుడికి ఏకాంతం కల్పించడం కోసం విశ్వేశ్వరరావు, జలజ మధ్యాహ్నంగా "బంధువుల ఇంటికి వెళ్లి వస్తామంటూ" ఊళ్లోనే ఉన్న విశ్వేశ్వరరావు పిన్ని కొడుకు ఇంటికి వెళ్లిపోయారు.

"మీ అమ్మలాగా మా అమ్మ ఆలోచించదెందుకో" అంటూ మధురిమను దగ్గరకు తీసుకున్నాడు శ్రీపతి.

## వెజ్జే బెటర్

అశిన్‌కి ఒకప్పుడు నాన్‌వెజ్ అంటే భలే ఇష్టంగా వుండేదిట. చిన్నతనంలో ఏరోజూ ముక్క లేనిదే ముద్ద ముట్టేది కాదట. అంతగా అడిక్ట్ అయిపోయిన అశిన్- నాన్‌వెజ్ క్రేజ్‌ని వాళ్ల మమ్మీ భలే రుచికరంగా వండుతుంది అని పొగుడుతుంది. అసలు మా అమ్మ అలా వండుతుంది కాబట్టే తనకి అంతగా నాన్‌వెజ్ అలవాటైపోయిందని కారణాన్ని ఆమె మీదకి తెలివిగా నెట్టేస్తుంది. అయితే క్రమంగా నాన్‌వెజ్‌పై తనకి మోజు తగ్గిపోయిందని చెబుతూ- ఇప్పుడు తనకి కాయగూరలే నచ్చుతాయంటుంది. కానీ ఎప్పుడైనా సీఫుడ్ రుచిని కొద్దిగా ఆస్వాదిస్తుంటుందిట అశిన్.

రెండు రోజులు రెండు క్షణాల్లా గడిచిపోయాయి. అయిష్టంగానే తిరుగుప్రయాణ మయ్యాడు శ్రీపతి.

ఆ తరువాత వారం శుక్ర వారం నాడే అనంతపురానికి బయల్దేరిన కొడుకుని చూసి మూతి ముడుచుకుంది సువ ర్చల.

"మాటకూ పిలవని పేరం టంలా అత్తగారింటికి వెళ్లి కూర్చోడం ఏం మర్యాదరా?" అన్నది విసుగ్గా.

"మరి ఏం చేయనే? సెలవు లొస్తే నాకు విసుగొస్తోంది. అయినా తను గనుక ఈసారి నాతో రాకపోతే నేనూ సెలవు పెట్టి అక్కడే ఉండిపోతాను. అప్పుడుగానీ తెలిసిరాదు మధుకి" అన్నాడు బూట్లు తొడు క్కుంటూ.

"ఇన్నాళ్లు పెంచిన మనం దూరమైపోయాం. నిన్నగాక మొన్న వచ్చిన ఆ పిల్ల లేకుండా ఉండలేనంటున్నాడు. చూశారా?" మొగుడితో బాధ వెళ్లబోసుకుంది సువర్చల.

ప్రకాశం నవ్వాడు. "చిన్నత నాన తల్లి కాపలా వయసున వల చిన వారు కాపలా అన్నాడొక కవి. వినలేదా? వాడి మనసెరిగి ప్రవర్తించి మన పెద్దరికాన్ని, వాడి అభిమానాన్ని నిలబెట్టు కోవాలి" అన్నాడాయన.

భర్త మాటలు తన తెలివితక్కువతనాన్ని చూపుతున్నట్టనిపించింది సువర్చలకు.

'కొడుకు సుఖంగా ఉండాలని వెదకి వెదకి చుక్కలాంటి పిల్లను తెచ్చి పెళ్లి చేసింది. పెళ్లాం చుట్టూ తిరుగుతూ తల్లిని నిర్లక్ష్యం చేశాదని బాధపడింది. వాడిని నవమాసాలు మోసి, కని పెంచిన తనకే శ్రీపతి మీద హక్కు ఉందను కుని ఎవరో పరాయి పిల్ల వచ్చి వాడిని తన చుట్టూ తిప్పుకుంటున్నదని అసూయ చెందింది. కోడలు పుట్టిం టికి వెడితే కొడుకు ముందున్నట్టుగా 'అమ్మా అమ్మా' అని తన వెంట చిన్న పిల్లాడిలా తిరుగుతాడనుకుంది. ఈ వయసులో వాడికి కావల్సిన ముద్దు మురిపాలు వేరని గ్రహించలేకపోయింది.'


ఆదివారం వియ్యంకుల ఇంటికి ఫోను చేసింది సువర్చల. జలజతో అయిదు నిముషాలు మాట్లాడి "అమ్మాయిని తీసికెళ్లి పదిహేను రోజులయిందిగా వదినా. వాడు మాత్రం వారం వారం తిరగడం కష్టం కదా! వాడితో బాటు పంపేయండి" అని మధురిమకు ఫోను ఇమ్మని ఆ అమ్మాయితో అన్నది. "కొత్తగా పెళ్లయిన వాళ్లు ఇన్నాళ్లు విడిగా ఉండడం బాగా లేదు మధురిమా! నువ్వు దగ్గర లేకపోతే వాడు తిండి కూడా సరిగ్గా తినడం లేదు. వాడితో బాటు బయల్దేరిరా. మీరిద్దరూ సుఖంగా ఉంటేనే మాకూ సంతోషం" అని.

"అలాగే అత్తయ్యా రాత్రికి బయల్దేరుతాం" అంది మధు రిమ.

ఇప్పుడు మళ్లీ శ్రీపతి ఆల స్యంగా ఆఫీసుకు వెళ్లి తొంద రగా ఇంటికి వస్తున్నాడు.

కొడుకు ఇంటికి రాగానే "అమ్మా మధురిమా వాడికి కాఫీ, టిఫిన్ సంగతి చూడు" అంటూ భర్తతో కలసి దగ్గరే ఉన్న శంకరమఠానికి బయల్దే రుతోంది సువర్చల.

'మనసున మనసై బ్రతు కున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ అదే స్వర్గమూ' అని పాడుకుంటూ మధురిమ సాన్నిధ్యంలో పరవశిస్తున్నాడు శ్రీపతి.






## ప్చ్! ఛార్మీ!!

'మంత్ర' సినిమా తర్వాత ఛార్మీకి చెప్పుకోదగిన హిట్టు లేదనే చెప్పాలి. 16 డేస్ పరాజయం తర్వాత విడుదలైన 'మనోరమ' కూడా తాజాగా ఫ్లాప్ లిస్టులోకి చేరింది. రాబోయే మాయగాడు, కావ్యాస్ డైరీ సినిమాల పరిస్థితి కూడా అంతంత మాత్రమేనని సినీవర్గాల సమా చారం. మరి పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎంతగా అందచందాలు ఆరేసినా ఫలితం దక్కదు కదా! కెరీర్‌కి బూస్ట్‌నిచ్చే సినిమా కోసం ఛార్మీ ఆశగా ఎదురుచూడ్డం సహజమే మరి!